స్వకృషి
సహకార ఉద్యమం

# స్వకృషి ధాన్య విత్తన సంఘాల ప్రగతి: 2008 -09

ప్రస్తుత పరిస్థితులలో ధాన్యాన్ని పండించే రైతులు నాణ్యమైన విత్తనం దొరకక చాలా ఇబ్బంది పడుతున్నారు. కల్తీ విత్తనాన్ని కొని రైతులు మోసపోతున్నారు. తాలు, బెరుకులు, ఇతర వ్యర్థ పదార్థాలు లేకుండా, తేమ శాతం 13కు మించకుండా, ఎక్కువ దిగుబడి అందించగల ధాన్య విత్తనాన్ని నాణ్యమైన విత్తనం అనవచ్చు. ఇటువంటి విత్తనాన్ని రైతులకు సరఫరా చేయాలనే ఉద్దేశ్యంతో 4 ధాన్య విత్తన సంఘాల ఏర్పాటుకు 1999లో సహవికాస సహాయ, సహకారాలు అందించినది. ఈ సంఘాలు వరంగల్ జిల్లాలోని మక్దుంపురం, కరీంనగర్ జిల్లాలోని గంగిపల్లి, పోరండ్ల. ధర్మరాజుపల్లి గ్రామాలలో ఉన్నవి.

స్వయం సహాయం, పరస్పర సహాయం, ప్రజాస్వామ్యం ప్రాతిపదికలుగా నాణ్యమైన ధాన్య విత్తన ఉత్పత్తి సేకరణ, సంసాధన మరియు విపణి సేవలు అందించుట ద్వారా సభ్యుల ఆర్థిక, సామాజిక స్థితిని మెరుగుపరచటమే కాక వేల మంది చిన్న, సన్నకారు రైతులకు నాణ్యమైన విత్తనాన్ని అందించడమే ఈ సంఘాల ఉద్దేశం.

ఈ సంఘాలు వివిధ వ్యవసాయ పరిశోధనా క్షేత్రాల నుండి బ్రీడర్ విత్తనాన్ని కొనుగోలు చేసి, సభ్యులకు సరఫరా చేసి, వారి నుండి ఫౌండేషన్ ముడి విత్తనాన్ని సేకరిస్తాయి. అట్టి విత్తనాన్ని శుద్ధిచేస్తే శుద్ధ ఫౌండేషన్ విత్తనం వస్తుంది. తిరిగి ఈ విత్తనాన్ని సభ్యులకు సరఫరా చేసి, వారి నుండి ట్రుత్‌ఫుల్ ముడి విత్తనాన్ని సేకరిస్తాయి. అట్టి విత్తనాన్ని శుద్ధిచేస్తే ట్రుత్‌ఫుల్ విత్తనం వస్తుంది. ఈ విత్తనాన్ని 30 కిలోల బస్తాలలో ప్యాకింగ్ చేసి స్థానికంగా, ఇతర ప్రాంతాలలో విక్రయిస్తాయి. ఈ నాలుగు సంఘాలు 2008-09లో (1.04.2008 నుండి 31.03.2009 వరకు) దాదాపుగా 37వేల క్వింటాళ్ళ నాణ్యమైన విత్తనాన్ని తమ బ్రాండ్ పేర్ల మీద మార్కెట్ చేసాయి. సగటున ఒక రైతు 3 ఎకరాల భూమిలో ధాన్యాన్ని పండిస్తున్నట్లుగా భావిస్తే ఈ సంఘాలు విక్రయించే విత్తనం దాదాపు 41 వేల మంది చిన్న, సన్నకారు రైతులు వినియోగించుకున్నారు. ఈ రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, క్రిష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విజయనగరం, అనంతపురం, శ్రీకాకుళం జిల్లాలు, కర్ణాటకలోని సిరిగుప్ప, రాయఘడ్ ప్రాంతాలు, తమిళనాడులోని సేలం ప్రాంతాలకు చెందినవారై ఉన్నారు. వీరు ఈ సంఘాలు ఉత్పత్తి చేస్తున్న నాణ్యమైన విత్తనాన్ని కొనుగోలు చేసి మంచి దిగుబడులను పొంది లాభాలను ఆర్జించాలని సహవికాస ఆశిస్తున్నది.

ఈ సంఘాలు ఏర్పాటై 10 సంవత్సరాలు పూర్తైనవి. ఈ కాలంలో ఈ సంఘాలకు సహవికాస రెండు రకాలుగా ఆర్థిక సహాయాన్ని అందించినది. గోదాముల నిర్మాణం, యంత్రాల కొనుగోలుకై నిర్ణీత నిక్షేపాల రూపంలో, వ్యాపార నిర్వహణకై పిలుపు నిక్షేపాల రూపంలో ఆర్థిక సహాయం అందించినది.

ఈ సంఘాల ఆర్థిక సంవత్సరము 1 ఏప్రిల్‌తో ప్రారంభమై 31 మార్చితో ముగియును. ఉప విధుల ప్రకారం ఆర్థిక సంవత్సరం పూర్తైన మూడు నెలలలోపు ఈ సంఘాలు మహాసభలు నిర్వహించుకోవలసి ఉంటుంది. 31.03.09 నాటికి నాలుగు సంఘాలలో 462 సభ్యులు ఉన్నారు. వీరి నిధులు రూ 139 లక్షలు, పొదుపు సమితుల నిధులు రూ 99 లక్షలు. సహవికాస నిక్షేపాలు రూ 19 లక్షలు, బ్యాంకు అప్పులు రూ 58 లక్షలు ఉన్నాయి. ఈ సంఘాలు 31.03.09 నాటికి రిజర్వులకు కేటాయించుకున్న మొత్తం రూ 178 లక్షలు కలదు. ఈ సంఘాలు మ్యాక్స్ చట్ట పరిధిలో నమోదైనాయి.

సభ్యులనుండి ముడి విత్తన ధాన్య సేకరణకు ఒక ఆర్థిక సంవత్సరానికి ఈ నాలుగు సంఘాలకు కలిపి దాదాపు రూ 250 లక్షల నిర్వహణ మూలధనం కావాలి. స్వకృషి ఉద్యమ భాగస్వాములైన పొదుపు సమితులలో అనుపయోగ నిల్వలు అధికంగా ఉంటున్నాయి. మక్దుంపురం, గంగిపల్లి, పోరండ్ల, ధర్మరాజుపల్లి సంఘాలు పొదుపు సమితుల నుండి సమితులలోని అనుపయోగ నిల్వలను నిర్వహణ మూలధనంగా అప్పు తెచ్చుకుంటున్నాయి. ఇట్టి అప్పు నిల్వ 31.03.09 నాటికి రూ 99 లక్షలు కలవు. తద్వారా స్వకృషి ఉద్యమంలోని పొదుపు సంఘాల సభ్యులు ఆర్థికంగా లాభపడుతున్నారు. అలాగే స్థానిక వనరులను స్థానికంగానే తగిన కాలంలో వినియోగించుకుంటున్నారు. ఇది స్వకృషి ఉద్యమ ఆర్థిక చక్రంలో శుభ పరిణామం. ఈ సంఘాలు బ్యాంకుల నుండి పొందిన అప్పు నిల్వ రూ 58 లక్షలు కలవు.

విత్తన నాణ్యతా ప్రమాణాలు రెండు, (1) కల్తీ విత్తనాన్ని గుర్తించటం, (2) తేమశాతాన్ని గుర్తించటం. సభ్యుల నుండి సేకరిస్తున్న ముడి విత్తనంలోని కల్తీ విత్తనాన్ని గుర్తించటానికి ఈ సంఘాలు భూతద్దాలను వినియోగిస్తున్నాయి. విత్తనంలో కల్తీ ఉన్నట్లుగా గమనిస్తే అట్టి విత్తనాన్ని తిరస్కరించాలి. అలాగే విత్తనంలోని తేమశాతం 13కు మించి ఉన్నట్లయితే అట్టి విత్తనం ఎక్కువకాలం నిల్వ ఉండదు. కనుక తేమ శాతాన్ని పరిశీలించే పరికరాన్ని ఈ సంఘాలు వాడుతున్నాయి.

**బ్రీడరు విత్తనం:** ఈ నాలుగు సంఘాలలో సంవత్సర ప్రారంభంలో 2 క్వింటాళ్ళ నిల్వ కలదు. ఈ సంవత్సరంలో ఫౌండేషన్ ముడి విత్తన ఉత్పత్తికై వ్యవసాయ పరిశోధనా క్షేత్రాల నుండి 48 క్వింటాళ్ళు కొనుగోలు చేసినారు. తమ సభ్యులకు 49 క్వింటాళ్ళు పంపిణీ చేసినారు. ముగింపు నిల్వ 1 క్వింటాలు కలదు.

**ఫౌండేషన్ ముడి విత్తనం:** సంవత్సర ప్రారంభంలో 1,530 క్వింటాళ్ళ నిల్వ కలదు. ఈ సంవత్సరంలో 2,538 క్వింటాళ్ళ విత్తనాన్ని సేకరించినాయి. మొత్తం ఫౌండేషన్ ముడి విత్తనం 4,068 క్వింటాళ్ళు. 449 క్వింటాళ్ళు ధాన్యంగా అమ్మినాయి. 2,183 క్వింటాళ్ళను శుద్ధి చేసినాయి. ముగింపు నిల్వ 1,436 క్వింటాళ్ళు కలదు. 2,183 క్వింటాళ్ళను శుద్ధి చేయగా, 1,962 క్వింటాళ్ళ (90%) విత్తనం, 125 క్వింటాళ్ళ (6%) స్మాల్ సీడ్, 96 క్వింటాళ్ళ (4%) తరుగుదల వచ్చినది.

**ఫౌండేషన్ విత్తనం:** సంవత్సర ప్రారంభంలో 81 క్వింటాళ్ళ నిల్వ కలదు. ఈ సంవత్సరంలో 241 క్వింటాళ్ళను ఇతరుల నుండి కొనుగోలు చేసినాయి. ఫౌండేషన్ ముడి విత్తనాన్ని శుద్ధి చేయగా వచ్చిన విత్తనం 1,962 క్వింటాళ్ళు. మొత్తం ఫౌండేషన్ విత్తనం 2,284 క్వింటాళ్ళు, ఇందులో నుండి 1,932 క్వింటాళ్ళు విత్తనంగా, 26 క్వింటాళ్ళు ధాన్యంగా అమ్మినాయి. ముగింపు నిల్వ 326 క్వింటాళ్ళు కలదు.

**ట్రూత్‌ఫుల్ ముడి విత్తనం:** సంవత్సర ప్రారంభంలో 15,728 క్వింటాళ్ళ నిల్వ కలదు. ఈ సంవత్సరంలో 55,238 క్వింటాళ్ళ విత్తనాన్ని సేకరించినాయి. మొత్తం ట్రూత్‌ఫుల్ ముడి విత్తనం 70,966 క్వింటాళ్ళు, 9,400 క్వింటాళ్ళు ధాన్యంగా అమ్మినాయి. 40,922 క్వింటాళ్ళను శుద్ధి చేసినాయి. ముగింపు నిల్వ 20,644 క్వింటాళ్ళు కలదు. 40,922 క్వింటాళ్ళను శుద్ధి చేయగా, 36,755 క్వింటాళ్ళ (90%) విత్తనం 2,714 క్వింటాళ్ళ (7%) స్మాల్ సీడ్, 1,453 క్వింటాళ్ళ (3%) తరుగుదల వచ్చినది.

**ట్రుత్‌ఫుల్ విత్తనం:** సంవత్సర ప్రారంభంలో 676 క్వింటాళ్ళ నిల్వ కలదు. ఈ సంవత్సరంలో 29 క్వింటాళ్ళను ఇతరుల నుండి కొనుగోలు చేసినాయి. ట్రుత్‌ఫుల్ ముడి విత్తనాన్ని శుద్ధి చేయగా వచ్చిన విత్తనం 36,755 క్వింటాళ్ళు. మొత్తం ట్రుత్‌ఫుల్ విత్తనం 37,460 క్వింటాళ్ళు. ఇందులో నుండి 29,614 క్వింటాళ్ళు విత్తనంగా, 250 క్వింటాళ్ళు ధాన్యంగా అమ్మినాయి. ముగింపు నిల్వ 7,596 క్వింటాళ్ళు కలదు.

2008-09లో ( 1.04.2008 నుండి 31.03.2009 వరకు ) ముక్దుంపురం సంఘం రూ 8 లక్షల 78 వేలు గంగిపల్లి సంఘం రూ 8 లక్షల 42 వేలు, ధర్మరాజుపల్లి సంఘం రూ 15 లక్షల 84 వేల మిగులును ఆర్జించినవి. సంఘాలకు విత్తనం సరఫరా చేసిన సభ్యులకు ఈ సంఘాలు వరుసగా క్వింటాలుకు రూ 51లు, రూ 15లు, రూ 30ల చొప్పున ధరల వ్యత్యాసాన్ని అందించగలుగుతాయి. 31.03.2009 నాటికి పోరండ్ల సంఘం రూ 12 లక్షల 92 వేల సంచితలోటుకు (Cumulative Loss) గురైనది.

ఈ ఆర్థిక సంవత్సరంలో ధర్మరాజుపల్లి సంఘం అదనపు గోదాంను నిర్మించుకోవడం విశేషం.

సంఘాల పాలకవర్గాలు, సభ్యులు తమతమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకపోవడం వలన విత్తన నాణ్యత లోపిస్తున్నది. ఈ సంఘాలకు విత్తన నాణ్యత ఊపిరి వంటిది. విత్తన నాణ్యతా లోపంవలన మార్కెట్‌లో ఈ సంఘాలకు ఉన్న మంచిపేరు, నమ్మకం పోవటమే కాక చట్టపరంగా కూడ చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. దీర్ఘకాలంలో సంఘాల యొక్క అమ్మకాలపై ఇది ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. తద్వార సంఘాల ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. కావున ఈ సంఘాల పాలకవర్గాలు, సభ్యులు ఎవరి బాధ్యతలను వారు గుర్తించి విత్తన నాణ్యతను పరిరక్షించాలి.

స్వకృషి ధాన్య విత్తన సంఘాలు నాణ్యమైన విత్తనాన్ని రైతులకు అందిస్తూ పలువురికి ఆదర్శంగా ఉంటాయని సహవికాస ఆశిస్తున్నది.